## టీజేఎఫ్ రజతోత్సవ సభ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నకిరేకల్, మే 27: హైదరాబాద్‌లోని జలవిహార్‌లో ఈనెల 31న నిర్వహించనున్న తెలంగాణ జర్నలిస్ట్ ఫోరం(హెచ్-143) రజతోత్సవ సభ వాల్‌పోస్టర్‌ను నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆవిష్కరించారు. నూతనంగా ఎన్నికైన టీయూడబ్ల్యూజే(హెచ్-143) ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా నకిరేకల్ నియోజకవర్గ కార్యవర్గాన్ని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కొమ్ము యా దగిరి, ప్రధాన కార్యదర్శి శిరస్సు రమేశ్, గౌరవ సలహాదారు వడ్లకొండ రామసాయిలు గౌడ్, ఉపాధ్యక్షుడు డేగటి శ్రీను, కార్యదర్శి గుండపల్లి వెంకన్న, సభ్యులు కొల్లు నరేశ్, కారంపూరి మధు, రహీమ్, చెన్నోజు చంద్రశేఖర్, రంగనాథ్, శంకర్ పాల్గొన్నారు.



కనగల్‌లో విత్తన దుకాణాలను తనిఖీ చేస్తున్న సీఐ ఆదిరెడ్డి

## నకిలీ విత్తనాలు అమ్మితే పీడీ యాక్ట్

నల్లగొండ సిటీ, మే 27: రైతులు నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత విత్తన దుకాణా డీలర్లపై ఉందని కనగల్ సీఐ ఆదిరెడ్డి అన్నారు. విత్తన డీలర్లు బాధ్యతగా నాణ్యమైన విత్తనాలు రైతులకు సరఫరా చేయాలన్నారు. మంగళవారం కనగల్లు మండలంలోని పలు ఫర్టిలైజర్ షాపులను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతుల వ్యవసాయానికి నష్టం కలిగేలా నకిలీ విత్తనాలు అమ్మితే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. గతంలో నకిలీ విత్తనాల కేసులో సంబంధం ఉన్న వారిపై నిఘా ఉంచామన్నారు. రైతులు నాణ్యమైన కంపెనీ విత్తనాలు ఎంచుకోవాలని, లేబుళ్లు ప్యాకింగ్ లేని విత్తనాలు కొనుగోలు చేయవద్దని సూచించారు. తక్కువ ధరకు వస్తున్నాయని గ్రామాలకు వచ్చే మధ్యవర్తుల వద్ద విడి విత్తనాలు కొనుగోలు చేయొద్దన్నారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన డీలర్ల నుంచి మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని తెలిపారు. డీలర్లు నకిలీ విత్తనాలను రైతులకు అంటగడితే సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో కనగల్ ఎస్సై విష్ణుమూర్తి, సిబ్బంది తదితరులు ఉన్నారు.

**ఫర్టిలైజర్ దుకాణాల్లో టాస్క్‌ఫోర్స్ తనిఖీలు**

నల్లగొండ మే 27: విత్తన తనిఖీల్లో భాగంగా మంగళవారం నల్లగొండ మండల టాస్క్‌ఫోర్స్ బృందం జిల్లా కేంద్రంలోని ఫర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీలు చేపట్టింది. ఈ సందర్భంగా వన్ టౌన్ సీఐ రాజశేఖర్ రెడ్డి, వ్యవసాయ అధికారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో పలు ఫర్టిలైజర్ దుకాణాలను పరిశీలించి నకిలీ విత్తనాలు ఉన్నాయా అనే కోణంలో తనిఖీలు చేశారు. అదేవిధంగా ఎరువులు, క్రిమిసంహారక మందులు కూడా ఎన్‌రోల్ చేస్తున్నారా లేదా అని పరిశీలించి, రిజిస్టర్లు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నకిలీ విత్తనాలను ప్రోత్సహించవద్దని సూచించడంతోపాటు రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించి, ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

శాలిగౌరారం మే 27: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెం దిన ఘటన మండల పరిధిలోని వంగమర్తి శివారులోని నేషనల్ హైవేపై సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. శాలిగౌరారం ఎస్ఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలం మామిడాల గ్రామానికి చెందిన కుర్ర శంకర్(30) కారులో నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం మీదుగా అర్వపల్లి వైపు వెళ్తున్నాడు. మార్గమధ్యంలోని వంగమర్తి శివారుకు చేరుకోగానే వెనుక నుంచి అతివేగంగా వచ్చిన డీసీఎం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నకిరేకల్ ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు తెలిపారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు. ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారును పక్కకు తొలగించామని ఎస్ఐ తెలిపారు.

**NCL HIGH SCHOOL & JUNIOR COLLEGE**
(C/o. NCL Industries Limited - Nagarjuna Cement)
Simhapuri, Mattampally Mandal, Suryapet District – 508204

**WALK-IN INTERVIEW**

**Teachers** for **Physical Science (High School), Mother Teather, Computer Instructor, P.E.T. – B.Ed Graduates** in relevant subjects having a minimum of 2 years' experience in reputed Schools.

**Vice-Principal** having B.Ed and minimum 3 years experience in similar position of reputed schools.

Candidates meeting the above criteria may **walk-in** for an interview, with their testimonials between **8.30 am and 5.00 pm on 28th, 29th & 30th May 2025** at **NCL HIGH SCHOOL & JUNIOR COLLEGE** Simhapuri, Mattapalli Village Mattampally Mandal, and Suryapet District – 508204.

Contact No: +91 9490436818 or +91 7997991494.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

**పేరు మార్పు**
నేను అనగా ముక్కంల్ల హోజస్వ యాదవ్, S/o. యదమల్ల్, వయస్సు:12 సం||లు, R/o.H.No.1-1, గ్రా|| రేపాక, అడ్డగూడూరు మండలం, యాదాద్రి భువనగిరి జిల్లా వాసిని నేను నా యొక్క పేరును ముక్కంల్ల రిషి హర్షిక్ యాదవ్‌గా మార్చుకోవడమైనది గమనించగలరు.

**PLOT FOR SALE**
★సాగర్ హైవే, విజయవాడ హైవేలలో తక్కువ ధరలో అపార్ట్‌మెంట్ ప్లాట్లు, Indp. ప్లాట్లు & ఓపెన్ ప్లాట్లు HMDA/DTCP అప్రూవల్ LRS గల ప్లాట్లు కలవు. 9603444402.
NT-331100

**WANTED TEACHERS**
**Wanted Teachers:** Devarakonda, Mathes, English, Social, Hindi, Science, Contact: 9603864518.

**గమనిక**
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న, లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం...
మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines,
Extra Line - Extra Amount
5% GST అదనం

నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం, గ్రా: చర్లపల్లి, మం: నల్లగొండ.

| | | |
|---|---|---|
| నల్లగొండ: 9182777625, 9182777635 | | దేవరకొండ: 9182777635 |
| హాలియా: 9182777059 | సూర్యాపేట: 9182777630 | భువనగిరి: 9182777638 |
| మిర్యాలగూడ: 9182777059 | కోదాడ: 9182777630 | చౌటుప్పల్: 9182777638 |

# ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

### మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

హాలియా, మే 27: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని, ప్రభుత్వం అంతరాలులేని సమానమైన విద్యను అందించేందుకు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి కోరారు. తెలంగాణ పౌర స్పందన వేదిక ఆధ్వర్యంలో హాలియాలో కళాజాత నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో పట్టణాల సంఖ్య, పట్టణ జనాభా రోజురోజుకూ పెరుగుతుందన్నారు. ఒకే పట్టణంలో రెండు మూడు చోట్ల ప్రభుత్వ పాఠశాలలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో పిల్లలను చదివిస్తున్న తల్లిదండ్రులెవరూ సంతృప్తిగా లేరన్నారు. నూటికి 80శాతం మంది తల్లిదండ్రులు అప్పులు చేసి తెచ్చిన డబ్బుతో పిల్లలను చదివిస్తున్నారని పేర్కొన్నారు. అభివృద్ధి చెందిన అమెరికా, బ్రిటన్‌లాంటి దేశాల్లో ఎక్కడా ప్రైవేట్ పాఠశాలలు లేవన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన, గుణాత్మకమైన విద్య అందిస్తారని చెప్పారు. ఈ ఏడాది నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ స్థాయి ఇంగ్లిష్ మీడియం విద్యను ప్రవేశపెట్టాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అనుముల మండల విద్యాధికారి గుండా కృష్ణమూర్తి, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కోశాధికారి రాజు, ఉపాధ్యాయ సంఘ నాయకులు బాణాల వెంకటేశ్వర్‌రావు, ప్రసాద్, వీరాసింగ్, వెంకటేశ్వర్లు, షర్ఫుద్దీన్, సునీత, సరిత, విజయ్‌పాల్‌రెడ్డి, రవీందర్, తదితరులున్నారు.



హాలియాలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

**ప్రభుత్వ బడులు నిలబడాలి**

మిర్యాలగూడ, మే 27: ప్రభుత్వ బడులు నిలబడాలని, చదువుల్లో అంతరాలు పోవాలని, ప్రభుత్వ బడుల్లో ప్రీ ప్రైమరీ స్కూల్స్ ప్రారంభించాలని కోరుతూ తెలంగాణ పౌర స్పందన వేదిక ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచార జాత మంగళవారం పట్టణానికి చేరుకుంది. అమరవీరుల స్తూపం వద్ద జరిగిన సభలో మాజీ ఎమ్మెల్సీ, పౌర స్పందన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు అలుగుబెల్లి నర్సిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో అంతరాలు లేని విద్య రావాలని, ప్రీ ప్రైమరీ స్కూల్స్ ప్రారంభించాలని డిమాండ్ చేశారు. తరగతి గదికి ఒక ఉపాధ్యాయుడు ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల కోసం ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని, కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో విద్యకు పదిశాతం నిధులు కేటాయించాలని, రాష్ట్రంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ తరగతులు ఏర్పాటుకు కేంద్రం రూ.5వేల కోట్లు ప్రత్యేక గ్రాంట్లు ఇవ్వాలన్నారు. క్రమంగా అంతరాలు లేని బడులను అభివృద్ధి చేయాలన్నారు. కార్యక్రమంలో టీపీపీఎస్సీ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు ఆర్.ధనమూర్తి, టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నాగమణి, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, జిల్లా కార్యదర్శులు శ్రీనివాస్‌రెడ్డి, చిన్నవెంకన్న, వేదశ్రీ, టాప్రా నాయకులు రమణారెడ్డి, సత్యనారాయణరావు, మాధవరెడ్డి, రామయ్య, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రవినాయక్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకుడు సైదానాయక్ తదితరులు పాల్గొన్నారు.



మిర్యాలగూడ ఫర్టిలైజర్ బజార్‌లో తనిఖీలు చేస్తున్న ఏవో సైదానాయక్, సీఐలు మోతీరామ్, రాంనర్సయ్య

## నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

మిర్యాలగూడ, మే 27: విత్తన డీలర్లు రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని ఏవో సైదానాయక్ అన్నారు. మంగళ వారం మిర్యాలగూడ పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని విత్తనాలు, ఫర్టిలైజర్స్ షాపులను వన్ టౌన్ సీఐ మోతీరామ్, టూటౌన్ సీఐ రాంనర్సయ్య, రూరల్ ఎస్ఐ లక్ష్మయ్యలతో కలిసి తనిఖీ చేశారు. రికార్డులు, బిల్ బుక్స్, ఇన్‌వాయిస్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ రైతులకు నకిలీ విత్తనాలు విక్రయించినట్లయితే కఠిన చర్యలు తప్పవని, బిల్‌బుక్కులు, రికార్డులు, స్టాక్ రిజిస్టర్లు అన్ని సక్రమంగా నిర్వహించాలన్నారు. డీలర్లు ఎమ్మార్పీకి మించి అధిక ధరలకు విత్తనాలు విక్రయించినట్లయితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని, లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు. వారి వెంట వ్యవసాయ, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

**లూజ్ పత్తి విత్తనాలు అమ్మితే కేసులు**

గుర్రంపోడు, మే 27: నకిలీ, లూజ్ పత్తి విత్తనాలు అమ్మితే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ పసుపులేటి మధు, వ్యవసాయాధికారి మాధవరెడ్డి హెచ్చరించారు. మంగళవారం పోలీసు, వ్యవసాయ శాఖ బృందాలు మండలంలో పలు ఎరువులు, విత్తన విక్రయ దుకాణాలను తనిఖీ చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలు గల విత్తనాలనే విక్రయించాలని, పత్తి విత్తనాలు విక్రయించేటప్పుడు తప్పనిసరిగా రైతులకు రసీదు ఇవ్వాలన్నారు. విక్రయ కేంద్రం వద్ద వ్యవసాయాధికారి ఫోన్ నెంబర్ ఫెక్సీని ఏర్పాటు చేయాలని సూచించారు. స్టాక్ వివరాలు నోటీస్ బోర్డుపై ప్రదర్శించాలన్నారు.

**రైతులు అప్రమత్తంగా ఉండాలి**

కట్టంగూర్, మే 27: నకిలీ విత్తనాలపై రైతులు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ మునుగోటి రవీందర్ అన్నారు. మంగళవారం వ్యవసాయ అధికారి గిరిప్రసాద్‌తో కలిసి మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి రికార్డులు, విత్తన ప్యాకెట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నకిలీ విత్తనాలు విక్రయించే వ్యాపారులపై కఠినచర్యలు తీసుకోవడంతోపాటు పీడీ యాక్టు నమోదు చేస్తామని హెచ్చరించారు. విడిగా విక్రయించే విత్తనాలను రైతులుకొనుగోలు చేయవద్దని, గుర్తింపు పొందిన కంపెనీల విత్తనాలను మాత్రమే కొనుగోలు చేయాలన్నారు. ఆయన వెంట వ్యవసాయ అధికారులు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

**చందంపేటలో తనిఖీలు**

చందంపేట, మే 27: నకిలీ విత్తనాలు విక్రయిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని చందంపేట ఎస్ఐ లోకేశ్ హెచ్చరించారు. మంగళవారం మండల వ్యవసాయ అధికారి లక్పతితో కలిసి పోలేపల్లిలో సీడ్స్, ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. రికార్డులు తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేస్తే తప్పనిసరిగా రసీదులు తీసుకోవాలన్నారు. నకిలీ విత్తనాల గురించి సమాచారం తెలిసిన వారు పోలీసులకు తెలియజేసి, సహకరించాలన్నారు.

## యాదగిరిరెడ్డికి బాల సాహిత్య పురస్కారం



బాలసాహిత్య పురస్కారం అందచేస్తున్న నిర్వాహకులు

రామగిరి, మే 27: తెలంగాణ సారస్వత పరిషత్ ప్రతిష్టాత్మకంగా అందించే బాలసాహిత్య పురస్కారం ఈ ఏడాది నల్లగొండకు చెందిన ప్రముఖ కవి, రచయిత మేరెడ్డి యాదగిరి రెడ్డికి దక్కింది. సోమవారం రాత్రి హైదరాబాద్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయనకు శాంత బయోటెక్స్ అధినేత పద్మభూషన్ వరప్రసాద్, సారస్వత పరిషత్ అధ్యక్ష,కార్యదర్శులు ఎల్లూరి శివారెడ్డి, జుర్రు చెన్నయ్య అందచేశారు. యాదగిరెడ్డికి నల్లగొండకు చెందిన సాహితీవేత్తలు డా. సాగర్ల సత్తయ్య, తండు కృష్ణకౌండిన్య, పెరుమాళ్ళ ఆనంద్, బండార్ శంకర్, శీలం భద్రయ్య, పెందోట సోమలు అభినందనలు తెలిపారు.

## బ్యాడ్మింటన్ సెలక్షన్స్

మిర్యాలగూడ, మే 27: జూన్ నుంచి సెప్టెంబర్ వరకు జరగనున్న రాష్ట్రస్థాయి బాలబాలికల, మహిళల, పురుషుల అండర్-11, 13, 15, 17, 19 బ్యాడ్మింటన్ పోటీలకు మిర్యాలగూడలోని క్లియో స్పోర్ట్స్ ఇండోర్ స్టేడియంలో జిల్లా జట్టును ఎంపిక చేస్తామని బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ ప్రశాంత్, పి.నవీన్‌కుమార్, గౌరవ అధ్యక్షుడు అంజయ్య, ఉపాధ్యక్షుడు మధుబాబు మంగళవారం తెలిపారు. అండర్ 15, 17, 19 బాలబాలికలకు, 35 నుంచి 80 ఏండ్ల వయస్సు గల మహిళ, పురుషుల గ్రూపు వాళ్లకు జూన్ 1న మధ్యాహ్నం 2గంటలకు సెలక్షన్స్ ఉంటాయని, అండర్ 11, 13 బాలబాలికలకు జూన్ 2న ఉదయం 10గంటలకు సెలక్షన్స్ నిర్వహిస్తామన్నారు. ఎంపికలో పాల్గొనే క్రీడాకారులు జిల్లా వాసులై ఉండాలన్నారు. ఎంపికైన క్రీడాకారులకు సర్టిఫికెట్‌తోపాటు మెడల్, టీషర్ట్ బహూకరిస్తామన్నారు. వివరాలకు 9848959215, 99480 52108 నెంబర్లను సంప్రదించాలన్నారు.



రామగిరి, మే 27: అహల్యాబాయి హోల్కర్ 300 ఏండ్ల జయంతి సందర్భంగా మంగళవారం నల్లగొండలో 30మంది మహిళా చేనేత కార్మికులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పద్మావతికాలనీవాసులు, మహిళలు పాల్గొన్నారు.

## కార్యదర్శులపై వేధింపులు మానుకోవాలి

మునుగోడు, మే 27: కార్యదర్శులపై వేధింపులు మానుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బొలుగూరి నరసింహ డిమాండ్ చేశారు. ఇన్‌చార్జి ఎంపీడీవో విజయ్‌భాస్కర్ వివిధ గ్రామాల కార్యదర్శుల మీద, ఎస్సీ, ఎస్టీ, బీసీ వెనుకబడిన సామాజిక కార్యదర్శుల మీద కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బొలుగూరి నరసింహ, రైతు సంఘం జిల్లా కార్యదర్శి గురుజ రామచంద్రం డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో అభివృద్ధి కోసం నిరంతర కృషి చేస్తున్న అణగారిన వర్గాలకు చెందిన కార్యదర్శులు ఆయనకు అనుకూలంగా పనిచేస్తలేరని, అత్యుత్సాహంతో ఏ మండలంలో లేని విధంగా ఏ, బీ, సీ గ్రేడ్లు చేసి కార్యదర్శులను ఇతర మండలాలకు బదిలీ చేయాలని ఉన్నతాధికారులకు సిఫారసులు చేయడం సరైంది కాదన్నారు. మండల కేంద్రంలో పొట్టకూటి కోసం రోడ్లమీద చిరు వ్యాపారాలు కొనసాగిస్తున్న వారి తోపుడు బండ్లు తొలిగించాలని, లేనిపోతే జరిమానాలు విధిస్తామనడం సరైనది కాదన్నారు. సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి చాపల శ్రీను, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కన్వీనర్ మాజీ జెడ్పీటీసీ గోసుకొండ లింగయ్య, మండల కార్యవర్గ సభ్యులు ఉప్పునూతల రమేష్, దుబ్బ వెంకన్న, వనం వెంకన్న, మండల కౌన్సిల్ సభ్యులు ఎండీ జానీ, కురుమర్తి ముత్తయ్య, తదితరులు పాల్గొన్నారు..

## నేడు పట్టుబడిన వాహనాల వేలం

దేవరకొండ, మే 27: దేవరకొండ ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో వివిధ కేసుల్లో పట్టుబడిన ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలను బుధవారం వేలం వేస్తామని ఎస్సై శ్రీని వాస్ ప్రకటనలో తెలిపారు. కార్యాలయ ప్రాంగణంలో వేసే వేలం పాటకు ఆసక్తి గల వారు ద్విచక్ర వాహనం కోసం పదివేలు, నాలుగు చక్రాల వాహనం కోసం రూ.30వేల ధరావత్ చెల్లించి నమోదు చేసుకోవాలని సూచించారు. వాహనం దక్కించుకున్న వారికి డిపాజిట్ చెల్లిస్తారని శ్రీనివాస్ తెలిపారు.

## ప్రత్యామ్నాయ పంటలు వేయాలి

చిట్యాల, మే 27: వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలు వేయాలని వ్యవసాయ అధికారి గిరిబాబు రైతులను కోరారు. మంగళవారం మండలంలోని సుంకెనపల్లి, ఆరెగూడెం, చిన్నకాపర్తి, శివనేనిగూ డెం, ఉరుమడ్ల గ్రామాల్లో రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ పత్తి, వరి రైతులు ఆ పంటలకు బదులు కంది, జొన్న, వేరుశనగ, ఆముదం, పొద్దుతిరుగుడు, తృణధాన్యాలు వేయాలని, అందుకు సంబంధించిన విత్తనాలను వ్యవసాయ శాఖ అందుబాటులోకి తెస్తుందన్నారు. పట్టాదారు పాసుపుస్తకం కలిగిన రైతులు రైతు గుర్తింపు నంబర్ పొందాలన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు వీణకుమారి, కృష్ణకుమారి, వాసుదేవ్, మనీష, శశాంక పాల్గొన్నారు.

**నేడు మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం**

చిట్యాల, మే 27: ఈ నెల 28న చిట్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ నర్ర వినోదామోహన్‌రెడ్డితోపాటు పాలకవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు మున్సిపల్ మాజీ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి, పోకల దేవదాసు, జడల చిన్నమల్లయ్య తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఆర్అండ్‌బీ మంత్రి కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే వేముల వీరేశం హాజరవుతున్నట్లు వారు వివరించారు.

**ముగిసిన ధాన్యం కొనుగోళ్లు**

నల్లగొండ సిటీ మే 27: కనగల్ మండలంలో ఐకేపీ, పీపీసీ ద్వారా నిర్వహించిన ధాన్యం కొనుగోళ్లు మంగళవారంతో ముగిసినట్లు మండల ఏపీఎం సంకుహరి తెలిపారు. జిల్లాలోనే అత్యధిక ధాన్యం కొనుగోలు చేయడంలో మండలం ప్రథమ స్థానంలో ఉందన్నారు. 6,817 మంది రైతుల నుంచి 5,53,770,40 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసి రూ.1,28,00 కోట్ల బిల్లులను ఇప్పటి వరకు చెల్లించామన్నారు. కొనుగోళ్లకు సహకరించిన కలెక్టర్, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

## నట్టల నివారణ మందు పంపిణీ చేయాలి



మాట్లాడుతున్న పెంపకందారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కిల్లె గోపాల్

చౌటుప్పల్, మే 27: జీవాలకు ప్రభుత్వం నట్టల నివారణ మందును ఉచితంగా పంపిణీ చేయాలని గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కిల్లె గోపాల్ అన్నారు. మంగళవారం చౌటుప్పల్ వృత్తిదారుల భవనంలో ఆ సంఘం నిర్వహించిన జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జీవాలకు ఉదయం పూట మందల వద్దనే ప్రభుత్వం వైద్యం అందించాలన్నారు. ప్రభుత్వ ఖజానా ఖాళీగా ఉందనే సాకుతో ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాల నుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తుందని ఆయన ఆరోపించారు. అంతేకాకుండా పెంపకందారుల సమస్యల పరిష్కారం కోసం జీఎంపీఎస్ ఆధ్వర్యంలో పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జీఎంపీఎస్ ఉమ్మడి జిల్లా డైరెక్టర్ బండారు నర్సింహ, జిల్లా అధ్యక్షుడు దయ్యాల నర్సింహ, ఉపాధ్యక్షుడు బుడమ శ్రీశైలం, మండల అధ్యక్షుడు కొండె శ్రీశైలం, నాయకులు మద్దెపురం రాజు, చేగూరి నర్సింహ్మా, నారి వెంకటేశ్, చలమంద రాజు తదితరులు పాల్గొన్నారు.

## టీబీ రహిత తెలంగాణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలి



త్రిపురారం పీహెచ్‌సీలో టీబీపై అవగాహన కల్పిస్తున్న వైద్యుడు సంజయ్

త్రిపురారం, మే 27: తెలంగాణలో టీబీని నామరూపాలు లేకుండా చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని త్రిపురారం పీహెచ్‌సీ వైద్యుడు మాలోత్ సంజయ్ అన్నారు. మంగళవారం పీహెచ్‌సీలో వంద రోజుల టీబీ క్యాంపును ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామగ్రామాన టీబీ పరీక్షలు నిర్వహిస్తున్నామని, కేవలం దగ్గు ఒక్కటే టీబీ లక్షణంకాదని ఛాతిలో నొప్పి చెమటతో కూడిన దగ్గు, తెమడలో రక్తం పడటం అలసట, నీరసం, గతంలో ఆరోగ్య సమస్యలు, బరువు తగ్గడం, రాత్రిపూట చెమటలు రావడం, శరీరంలో ఏ భాగంలోనైనా వాపు రావడం ఇలాంటి లక్షణాలు ఉన్న ఎవరైనా టీబీ పరీక్ష చేయించుకోవాలన్నారు. టీబీ వ్యాధిపై గ్రామాల్లోని ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు పట్ల గోపాల్‌రెడ్డి, కమలమ్మ, టీబీ సూపర్‌వైజర్ నాగిరెడ్డి, సబ్ యూనిట్ ఆఫీసర్ వాసుదేవరెడ్డి, సిబ్బంది నూర్జహాన్, యాదమ్మ, గౌతమి, హైమావతి, నలినీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ సామగ్రి పంపిణీ చేయాలి



విద్యుత్ కార్యాలయంలో వినతిపత్రం అందచేస్తున్న రైతు సంఘం నాయకులు

మిర్యాలగూడ, మే 27:వ్యవసాయానికి అవసరమైన మోటర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరైనప్పటికీ విద్యుత్ సామగ్రి అందించకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని తక్షణమే విద్యుత్ సామగ్రి పంపిణీ చేయాలని రైతు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ట్రాన్స్‌కో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గత సీజన్‌లో వ్యవసాయానికి మోటర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు అవసరం ఉందని రైతులు డీడీలు కట్టి ఎదురు చూస్తున్నారని, గత యాసంగి పూర్తయి, వానకాలం మొదలైందని అయినా ఇప్పటివరకు ట్రాన్స్‌ఫార్మర్లు బిగించలేదని ఆరోపించారు. ఇదేంటని అధికారులను ప్రశ్నిస్తే కాంట్రాక్టర్లను అడగాలని సూచిస్తున్నారని, కాంట్రాక్టర్లను అడిగితే మెటీరియల్ ఇవ్వడం లేదని సమాధానం చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీని వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే అధికారులు వి ద్యుత్ మెటీరియల్ అందించి రైతులకు కరెం ట్ ఇబ్బందులను తొలగించాలని డిమాండ్ చేశారు. అనంతరం కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర నాయకులు డబ్బీకార్ మల్లేశ్, నాయకులు మల్లు గౌతంరెడ్డి, బావండ్ల పాండు, రవినాయక్, పాదూరి శశిధర్‌రెడ్డి, గోవింద్‌రెడ్డి, గోవర్ధన, సైదమ్మ, కూన్‌రెడ్డి వెంకట్‌రెడ్డి, కందుకూరి రమేష్, పిల్లుట్ల సైదులు, నాగుల్ హుస్సేన్, చౌగాని వెంకన్న, నాగేశ్వర్‌రావు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా ప్రభుత్వం కాదు...దిక్కుమాలిన ప్రభుత్వం



సర్పంచ్‌ల సంఘం జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్‌ను అరెస్టు చేస్తున్న పోలీసులు

సంస్థాన్ నారాయణపురం, మే 27: సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులు చెల్లించాలని ప్రశ్నిస్తే మాజీ సర్పంచ్‌లను అరెస్టు చేయడం సిగ్గుచేటని సర్పంచ్‌ల సంఘం జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ విమర్శించారు. ప్రజావాణిలో పెండింగ్ బిల్లులు చెల్లించాలని వినతిపత్రం అందజేసే కార్యక్రమానికి పిలుపునివ్వండతో మండలంలోని పలువురు మాజీ సర్పంచ్‌లు, సర్పంచ్ సంఘం జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్‌ను ముందస్తుగా అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ బిల్లులు రాక ఎంతో మంది మాజీ సర్పంచ్‌లు అప్పుల బాధ తట్టుకోలేక ఆత్మహత్య చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమ అరెస్టులు, నిర్బంధాలతో సర్పంచ్‌లను వేధిస్తున్న సీఎం రేవంత్ రెడ్డిది ప్రజా ప్రభుత్వం కాదని, దిక్కుమాలిన ప్రభుత్వమని ఎద్దేవా చేశారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలని ప్రభుత్వానికి ఎన్ని సార్లు మొరపెట్టుకున్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందన్నారు. సర్పంచ్ పెండింగ్ బిల్లులకు నిధుల తక్షణమే విధుల చేయాలని డిమాండ్ చేశారు.

## మనస్తాపంతో పురుగుల మందు తాగి వ్యక్తి మృతి

కొండమల్లేపల్లి, మే 27: మనస్తాపంతో వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలకేంద్రంలోని మటిల్డా స్కూల్ సమీపంలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్ఐ అజ్మీరా రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం నేరేడుగొమ్ము మండలంలోని పేర్వాలకు చెందిన యాదయ్య(48) వ్యవసాయం, గీత కార్మికుడిగా జీవనోపాధి సాగిస్తున్నాడు. కుటుంబంలో జరిగిన కలహాలతో యాదయ్య సోమవారం కొండమల్లేపల్లి పట్టణానికి వచ్చి ఓ ఫర్టిలైజర్ దుకాణంలో పురుగుల మందు కొనుగోలు చేసి సోమవారం రాత్రి తాగి మృతి చెందాడు. మంగళవా రం ఉదయం స్థానికులు కొంతమంది అటుగా వెళ్లగా మృతి చెంది ఉన్న ఎరుకల యాదయ్యను చూసి పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో కుటుంబ సభ్యులు తెలుసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండలోని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య కృష్ణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేశ్ తెలిపారు.

**రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి**

కట్టంగూర్, మే 27: రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందిన ఘటన మండలంలోని ముత్యాలమ్మగూడెం పరిధిలోని సవుళ్లగూడెం వద్ద 65వ జాతీయ రహదారిపై మంగళవారం చోటు చేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన వనం లక్ష్మి(53)ఉదయం ఇడ్లీ కోసం ఇంటి సమీపంలో ఉన్న హోటల్ వద్ద నడుకుంటూ వెళ్తుంది. ఇదే క్రమంలో హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న మహేంద్ర గూడ్స్ వాహన డ్రైవర్ అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుతూ వెనుక నుంచి ఢీకొట్టాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన లక్ష్మిని స్థానికులు నార్కట్‌పల్లి కామినేని దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృత దేహాన్ని పోస్టుమార్టం కోసం నకిరేకల్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతురాలి కుమారుడు తిరుమలేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ మునుగోటి రవీందర్ తెలిపారు.

**చికిత్స పొందుతూ వివాహిత మృతి**

గుర్రంపోడ్, మే 27: చికిత్స పొందుతూ వివాహిత మృతి చెందిన ఘటన మండలంలోని జిన్నాయిచింత గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్ఐ పసుపులేటి మధు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కట్టెబోయిన రాధ(30) తన భర్త వెంకటేశ్ ఏ పని సరిగా చేయకుండా మద్యానికి బానిస కావడంతో అప్పులు పెరిగి అవి తీర్చే మార్గం లేక ఆదివారం రాత్రి 12 గంటలకు ఎలుకల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు దేవరకొండ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం నల్లగొండకు పంపగా, అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. మృతురాలి తల్లి గార్ల నాగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మధు తెలిపారు.

## పెండింగ్ బిల్లులు చెల్లించాలి

చందంపేట, మే 27: సర్పంచులు తమ పదవీకాలంలో చేపట్టిన పనులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే విడుదల చేయాలని సర్పంచుల ఫోరం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు జర్పుల లోక్యానాయక్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ సర్పంచుల పదవీకాలం ముగిసినప్పటికీ ఇప్పటి వరకు బిల్లులు చెల్లించడంలో జాప్యం చేయ డం తగదన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి సర్పంచ్‌ల బకాయి బిల్లులు చెల్లించాలని కోరారు.

## విద్యుత్ సరఫరా నిలిపివేత

త్రిపురారం/మిర్యాలగూడ, మే 27: నీలాయిగూడెం సబ్‌స్టేషన్‌లో మెయింటెనెన్స్ పనులు చేపడుతున్నందున నీలాయిగూడెం, అంజనపల్లి, ఘంటారావు క్యాంపుల్లో బుధవారం 12 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏఈ బాలు తెలిపారు. అలాగే 11కేవీ ఫీడర్ లైన్ పనులు జరుగుతున్నందున మిర్యాలగూడలోని రామచంద్రగూడెం, రాంనగర్, చైతన్యనగర్, తాళ్ల గడ్డ, భాగ్యనగర్‌కాలనీల్లో మధ్యాహ్నం 1.30 వరకు సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ మహేశ్ తెలిపారు.